జగనన్నతోనే పేదలకు న్యాయం



పెనుకొండరూరల్: కోనాపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకరనారాయణ



హిందూపురం: సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్



అగళి: ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు సుబ్బమ్మ. వీరిది పెనుకొండ మండలంలోని కోనాపురం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయంలో అమ్మఒడి, పింఛన్, చేయూత, గృహనిర్మాణం తదితర పథకాల ద్వారా సుబ్బమ్మ కుటుంబం రూ.5,61,000 లబ్ధి పొందింది. పేదలకు ఇంతలా మంచి చేసిన ముఖ్యమంత్రిని గతంలో ఎన్నడూ చూడలేదని సుబ్బమ్మ కొనియాడారు. పేదలందరి ఆశీర్వాదాలు జగనన్నకు ఉంటాయన్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు నాగరత్నమ్మ. వీరిది హిందూపురం మండలంలోని సంజీవరాయునిపల్లి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మూడున్నరేళ్లల్లో ఈమె కుటుంబానికి రూ.2,76,694 లబ్ధి చేకూరింది. అమ్మఒడి పథకం ద్వారా రూ.13 వేలు, వైఎస్సార్ ఆసరా రూ.8,590, జగనన్న విద్యాదీవెన, వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం, అందరికీ ఇళ్లు పథకం ద్వారా లబ్ధి పొందారు. జగనన్న ప్రభుత్వంలో తమకు అన్ని విధాలా న్యాయం జరిగిందని నాగరత్నమ్మ సంతోషం వ్యక్తం చేశారు. ఇలాంటి ముఖ్యమంత్రి కలకాలం ఉండాలని కోరుకుంటున్నామన్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న ఈమె పేరు బాలమ్మ. అగళి మండలం ఇరిగేపల్లిగొల్ల హట్టి గ్రామం. వైఎస్ జగన్ పాలనలో ఈ కుటుంబానికి జగనన్న అమ్మఒడి పథకం కింద రూ.14 వేలు, వైఎస్సార్ పింఛన్ కానుక కిందరూ.82 వేలు లబ్ధి చేకూరింది. అలాగే రూ.2 లక్షల విలువ చేసే ఇంటి స్థలం కూడా మంజూరైంది. ఈ కుటుంబానికి మొత్తం రూ.2.96 లక్షలు లబ్ధిచేకూరింది. తమ కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించి ఆదుకుంటున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు అండగా ఉంటామని బాలమ్మ తెలిపారు.

- మరోసారి ఆయనకే పట్టం కడతామంటున్న లబ్ధిదారులు

మడకశిర(అగళి): వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రి అయితేనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని పలువురు లబ్ధిదారులు పేర్కొన్నారు. సంక్షేమ పథకాలను పక్షపాతం లేకుండా అందిస్తున్న ఘనత కూడా ఆయనకే దక్కుతుందని చెప్పారు. బుధవారం అగళి మండలం ఇరిగేపల్లిగొల్ల హట్టిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ నవరత్నాలు రాష్ట్రంలోని పేదలకు వరంగా మారాయని తెలిపారు. ఏపీలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశ వ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటున్నాయన్నారు. మరోసారి వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. జగనన్న మరోసారి సీఎం అయితేనే సంక్షేమ పథకాలు అలాగే కొనసాగుతాయని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేద విద్యార్థుల ఉన్నత చదువు కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. విద్యాదీవెన, వసతి దీవెన తదితర పథకాల ద్వారా పేద విద్యార్థులకు అండగా నిలబడుతున్నారని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలన్నీ ప్రభుత్వం దాదాపుగా నెరవేర్చిందని తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబు చెప్పే మాయ మాటలను నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మహేంద్ర, కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రప్ప, సచివాలయం కన్వీనర్లు, మండల ఇన్‌చార్జ్ శివన్న, స్థానిక నాయకులు తిప్పేస్వామి, నటరాజు, సురేష్, శివలింగప్ప తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు..

పెనుకొండ రూరల్: పెనుకొండ నగర పంచాయతీ 19 వార్డు కోనాపురంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగానే ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా స్థానికులు పింఛన్లు మంజూరు కోసంన్ డ్రైనేజీ కాలువలు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, గృహాలు మంజూరు చేయించాలని ఎమ్మెల్యేకు విన్నవించారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్ వ్యవస్థ పనితీరును స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. చిన్నారులు గులాబీలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరనారాయణ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ నగర పంచాయతీ చైర్మన్ ఫరూఖ్, వైస్ చైర్మన్ సునీల్, కో ఆప్షన్ మెంబర్ వెంకటరామిరెడ్డి, కౌన్సిలర్ సంజీవమ్మ, కమిషనర్ వంశీకృష్ణ, ఎంపీడీఓ శివశంకరప్ప, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహులు, మండల కన్వీనర్ నాగళురు బాబు, కౌన్సిలర్లు తయుబ్, భాస్కర్, నాయకులు వైశాలి జయశంకర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పొగాకు రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

జరుగుతున్న మంచిని జనమే చెబుతున్నారు..

హిందూపురం టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బేవినహళ్లి పంచాయతీ సంజీవరాయనపల్లి, ఊడుగులపల్లి గ్రామాల్లో ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఎమ్మెల్సీ గడప గడపకూ వెళ్లి మూడున్నరేళ్లల్లో రాష్ట్ర ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. 'వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏం జరిగిందో.. టీడీపీ నాయకులు నేరుగా ప్రజల వద్దకే వెళ్లి తెలుసుకోవచ్చు. ప్రజలే ప్రభుత్వం చేసిన మంచిని, సంక్షేమాన్ని వివరిస్తున్నారు' అని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ పేర్కొన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని ఆయన ప్రజలకు సూచించారు. హిందూపురం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, తాము అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. అనంతరం ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్సీ దృష్టికి తీసుకురాగా.. వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆనంద్, జెడ్పీటీసీ నాగభూషణం, వైస్ ఎంపీపీ రఘునాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లేష్, వైస్ సర్పంచ్ సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చింత ఫలసాయం వేలం వాయిదా

రొళ్ల: మండలంలోని రంగనపల్లి చింతతోపు ఫలసాయం వేలాన్ని ఫిబ్రవరి 1కి వాయిదా వేసినట్లు ఈఓఆర్డీ క్రిష్ణప్ప తెలిపారు. బుధవారం దొడ్డేరి సచివాలయం ఆవరణంలో రంగనపల్లి చింతతోపు ఫలసాయానికి వేలం పాటను నిర్వహించారు. అయితే ఈ వేలం పాటకు వ్యాపారస్తులు హాజరు కాకపోవడంతో వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

టీడీ పల్లిలో అడవికి నిప్పు



అగ్నికి ఆహుతవుతున్న చెట్లు

రొళ్ల: పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వాలు మొక్కల పెంపకానికి కృషి చేస్తుంటే కొందరు మాత్రం పచ్చని అడవులకు నిప్పుపెడుతూ ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. బుధవారం సాయంత్రం రొళ్ల మండలం కొడగార్లగుట్ట గ్రామ సమీపంలోని టీడీ పల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు మార్గం పక్కన ఉన్న అటవీ ప్రాంతానికి దుండగులు నిప్పు పెట్టడంతో వందలాది చెట్లు కాలీ బూడిదయ్యాయి. సంబంధిత అధికారులు వచ్చి మంటలు ఆర్పేలోపే వందలాది చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి నిఘా ఉంచి అటవీ ప్రాంతాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

జగనన్న కాలనీలో నీటి సమస్యకు చెక్

గోరంట్ల: మల్లాపల్లి సమీపంలోని జగనన్న కాలనీలో నీటి సమస్య పరిష్కారం కోసం బుధవారం మండల పరిషత్ నిధులతో నూతన బోరుబావి తవ్వకానికి అధికారులు శ్రీకారం చుట్టారు. బుధవారం మండల పరిషత్ అధ్యక్షురాలు ప్రమీల, ఎంపీడీఓ రఘునాథగుప్తా తదితరులు బోరు బండికి ప్రత్యేక పూజలు చేసి పనులు ప్రారంభించారు.

వృద్ధాశ్రమానికి తరలింపు



అనాథ వృద్ధుడిని ప్రశాంతి వృద్ధాశ్రమంలో చేర్పిస్తున్న దృశ్యం

పరిగి: మండలంలోని వివిధ ప్రాంతాల్లో సంచరిస్తున్న నరసింహమూర్తి అనే అనాథ వృద్ధుడిని స్థానిక ఎంపీటీసీ ఎం మారుతీరెడ్డి, స్థానికులు గుర్తించి సేవా మందిరంలోని ప్రశాంతి వృద్ధాశ్రమానికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. చింపిరి జుట్టు, మాసిన గడ్డం, చిరిగిన చొక్కా, పంచెతో ఉన్న వ్యక్తికి సపర్యలు చేశారు. తనది లేపాక్షి మండలమని తనకు బంధువులెవరూ లేరని వృద్ధుడు చెప్పడంతో ప్రశాంతి వృద్ధాశ్రమంలో సిస్టర్ ఇషావాలాకు వివరాలు తెలియజేసి నరసింహమూర్తి ఆశ్రమంలో చేర్పించారు.

ఉపాధి పనులపై సమీక్ష

రొద్దం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశ భవనంలో బుధవారం గ్రామీణ ఉపాధి హామీ పథకంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ జయసింహ మాట్లాడుతూ ఉపాధి కూలీల సంఖ్య పెంచాలన్నారు. పండ్ల తోటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ కూలీల సంఖ్య పెంచడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ జగదీశ్వర్, టెక్నికల్, ఫీల్డ్, ఈసీలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దొడగాటమ్మ ఉత్సవాలు



ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

అమరాపురం: మండలంలోని హలుకూరు పొలిమేరలో వెలసిన దొడగాటమ్మ కరియమ్మ ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా భక్తులు దొడగాటమ్మ, కరియమ్మ ఉత్సవ విగ్రహాలను ఆలయ ఆవరణం నుంచి సమీపంలోని వంక వద్దకు తీసుకెళ్లి అక్కడ దేవతామూర్తులను కూర్చొబెట్టి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు జలధిపూజ చేశారు. అనంతరం అర్చకులు వివిధ హోమాలను చేశారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

సకాలంలో సరుకులివ్వాలి

పరిగి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇంటింటికీ నిత్యావసర సరుకుల పంపిణీలో భాగంగా సకాలంలో లబ్ధిదారులకు రేషన్ సరుకులు అందజేయాలని తహసీల్దారు సౌజన్యలక్ష్మీ తెలిపారు. స్థానిక కార్యాలయంలో మండల వ్యాప్తంగా ఉన్న రేషన్ షాపు డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీనరసింహం పాల్గొన్నారు.

మొక్కజొన్నలో పంటకోత ప్రయోగం



మొక్కజొన్న పంట కోత ప్రయోగాలు నిర్వహిస్తున్న అధికారులు

రొద్దం: మండలంలోని దొడగట్టలో బుధవారం మొక్కజొన్నలో పంట కోత ప్రయోగాలు నిర్వహించారు. రైతు వెంకటేష్ వ్యవసాయ పొలంలో ప్రభుత్వ నిబంధనల మేరకు కొలతలు చేపట్టి ప్రయోగాలు నిర్వహించామని జిల్లా ఆర్థిక గణాంక అధికారి విజయ్‌కుమార్ తెలిపారు. రైతు పొలంలో 21.200 కేజీల దిగుబడి వచ్చిందన్నారు. కార్యక్రమంలో డివిజన్ స్టాటిస్టిక్స్ అధికారి మల్లికార్జున, ఏఈఓ అంజాద్, ఏఎస్‌ఓ రమణ, వీపీఏ నరేంద్ర, రైతులు పాల్గొన్నారు.

28న పెనుకొండకు బాబూమోహన్ రాక

పెనుకొండ: ఈనెల 28న పెనుకొండ పట్టణంలోని జూనియర్ కళాశాలలో నిర్వహించనున్న 'అనంత ఆణిముత్యాలు' కార్యక్రమానికి సినీనటుడు బాబూమోహన్ హాజరుకానున్నట్లు సాహితీ గగన్‌మహల్ ట్రస్ట్ అధ్యక్షుడు జే. ప్రతాపరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

ఉమానర్మదేశ్వరుల ఆలయంలో హోమాలు



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం: పట్టణంలోని త్యాగరాజనగర్‌లో నూతనంగా నిర్మించిన ఉమానర్మదేశ్వరుల ఆలయ ప్రారంభోత్సవంలో భాగంగా బుధవారం పూజా కార్యక్రమాలు ప్రారంభమైయ్యాయి. మొదటిరోజు అంకుర్పాణ, గంగపూజ, కలశస్థాపన కార్యక్రమాలు పూర్తిచేశారు. బుధవారం ఉదయం వేదపండితులతో కలశార్చన, రుద్రాభిషేకం, పుష్పాదివాసంతో పాటు హోమాలు చేశారు.

ఓటు హక్కు వజ్రాయుధంతో సమానం







పెనుకొండ: విద్యార్థులతో ప్రమాణం చేయిస్తున్న సబ్‌కలెక్టర్ కార్తీక్, లేపాక్షి: ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, రొద్దం: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

పెనుకొండ: పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలోని 162, 163, 164 పోలింగ్ కేంద్రాల్లో బుధవారం 13వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సబ్‌కలెక్టర్ కార్తీక్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు నమోదు చేసుకుని ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం పొందాలన్నారు. మెరుగైన సమాజ నిర్మాణానికి ఓటు కీలకమన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలన్నారు. అనంతరం విద్యార్థులతో ఓటు నమోదుపై ప్రమాణం చేయించారు.

పరిగి: మండలంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం, పంచాయతీ కార్యాలయం, గ్రంథాలయం తదితర కార్యాలయాల్లో ఓటరు దినోత్సవాన్ని జరుపుకున్నారు. స్థానిక కార్యాలయంలో తహసీల్దారు సౌజన్యలక్ష్మీ ఆధ్వర్యంలో ఓటరు దినోత్సవంపై ప్రతిజ్ఞ చేయించి, ఓటు నమోదు, ఓటు హక్కు విలువలను వివరించారు. ఆమె మాట్లాడుతూ ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదన్నారు. ప్రతి ఐదేళ్లకు ఒక సారి వినియోగించుకుని అసెంబ్లీకి, పార్లమెంట్‌కు సరైన, తమకు నచ్చిన నాయకులను పంపే హక్కు కేవలం ఓటరుకు మాత్రమే ఉంటుందన్నారు.



పరిగి: ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

గోరంట్ల: మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు ప్రైవేటు విద్యా సంస్థలల్లో బుధవారం జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మార్సీ ప్రాంగణంలో ఐసీడీఎస్, ప్రభుత్వ ఉద్యోగులు, టీచర్లు ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతిజ్ఞ చేశారు. అలాగే స్థానిక ఎస్‌వీపీయం డిగ్రీ కళాశాలలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు విలువను తెలియజేశారు.

రొద్దం: ఓటు హక్కును పొందడం ప్రతి పౌరుని బాధ్యత అన్ని తహసీల్దార్ అనంతచారి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద జాతీయ ఓటర్ల దినోత్సం సందర్భంగా ప్రజలతో అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

చిలమత్తూరు: ఓటు హక్కును ప్రతి పౌరుడు బాధ్యతగా భావించాలని తహసీల్దార్ నాగరాజు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు ప్రాధాన్యతను గుర్తించే ప్రతిజ్ఞ చేశారు.

పావగడ: నోటుకు ఓటును అమ్ముకోకుండా ఉత్తమ అభ్యర్థికి ఓటు వేసి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ విద్యార్థులకు సూచించారు. స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన ఓటరు దినోత్సవంలో ఆయన ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియజేశారు. ఈ సందర్భంగా కన్నడ అధ్యాపకుడు అశ్వర్థ ఓటరు దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు.

లేపాక్షి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఉదయం సచివాలయ ఉద్యోగులు, మండల పరిషత్, రెవెన్యూ కార్యాలయం సిబ్బంది జాతీయ ఓటరు దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ నరసింహనాయుడు, తహసీల్దార్ బాబు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు అనే బ్రహ్మాస్త్రంతో శాసించగలిగే హక్కును భారత రాజ్యాంగం కల్పించిందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

సుబ్రహ్మణ్యస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



విశేష అలంకరణలో సుబ్రహ్మణ్యస్వామి

రొళ్ల: మండలంలోని రత్నగిరిలో వెలసిన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం సాయంత్రం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు వేదపండితుల ఆధ్వర్యంలో మహా గణపతి పూజ, కలశ స్థాపన, దీక్షా హోమం, ధ్వజారోహణ, తదితర పూజలు చేసి మహా మంగళారతి ఇచ్చారు. తర్వాత వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని మూల విగ్రహాలను అలంకరించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. అలాగే గురువారం స్వామివార్ల కల్యాణోత్సవం, శుక్రవారం బ్రహ్మరథోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో జలధి ఉత్సవం



సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం



జలధి పూజకు తరలివెళ్తున్న భక్తులు

అమరాపురం: మండలంలోని హేమావతిలో వెలసిన దళితుల ఆరాధ్య దేవత గంగమాళమ్మదేవికి బుధవారం జలధి పూజ కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతనంగా నిర్మించిన ఆలయాన్ని ప్రారంభించారు. అనంతరం మహిళా భక్తులు బిందెలు తీసుకుని గంగా పూజ చేసి అక్కడి నుంచి గంగా జలాన్ని దేవాలయం వరకూ తీసుకొచ్చారు. ఆలయ ఆవరణలో గంగా జలాన్ని ఉంచి ప్రత్యేకంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యాక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. మండలం నుంచే కాకుండా సమీప కర్ణాటక ప్రాంతాల నుంచి కూడా భక్తులు తరలి వచ్చారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

దేశభక్తిని అలవర్చుకోవాలి

హిందూపురం: దేశ స్వాతంత్య్రం కోసం తమ ప్రాణాలు సైతం పణంగా పెట్టిన దేశ మహానాయకులను స్ఫూర్తిగా తీసుకుని దేశ భక్తిని అలవర్చుకుని భావిభారత పౌరులుగా ఎదగాలని సీడీపీఓ రెడ్డి రమణమ్మ అన్నారు. బుధవారం మోతుకుపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో ముందస్తు గణతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. చిన్నారులు వివిధ దేశనాయకుల వేషధారణలతో అలరించారు. అనంతరం చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేశారు.

కంపచెట్ల తొలగింపు

చిలమత్తూరు: దేమకేతేపల్లి పంచాయతీ పరిధిలోని కొర్లకుంటకు వెళ్లే రహదారికి ఇరువైపుల పెరిగిన కంపచెట్లను సర్పంచ్ తిరుమలేష్ ఆధ్వర్యంలో జేసీబీ ద్వారా తొలగించారు. సర్పంచ్ మాట్లాడుతూ వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యగా కంప చెట్లను తొలగించినట్లు పేర్కొన్నారు. డి.గొల్లపల్లి నుంచి ఓబుళాపురం వరకూ సుమారు 5 కి.మీ మేర కంపచెట్లు తొలగించనున్నట్లు పేర్కొన్నారు.

మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

మడకశిర(అగళి): మండలంలోని వివిధ గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నరసంబూది గ్రామానికి చెందిన లోకేష్, హెచ్‌డీ హళ్లితండాకు చెందిన మంజునాథ్‌ను బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ లావణ్య తెలిపారు. లోకేష్ నుంచి 50 కర్ణాటక మద్యం బాటిళ్లు, మంజునాథ్ నుంచి 192 కర్ణాటక మద్యం పాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వారిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. మండలంలో అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ తెలిపారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి

పెనుకొండ: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆటో కార్మికుల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు గౌస్, ప్రధాన కార్యదర్శి బాబా పేర్కొన్నారు. పట్టణంలోని ఎన్‌హెచ్ 44 హైవే జంక్షన్ వద్ద బుధవారం నూతనంగా ఆటో యూనియన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు మీరితే చర్యలు

హిందూపురం: పర్యావరణ పరిరక్షణ చట్టం ప్రకారం ప్రభుత్వ ఆదేశాలతో ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, బ్యానర్లు నిషేధిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు తెలిపారు. జనవరి 26 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్లాస్టిక్ ఫ్లెక్సీలను నిషేధిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. అయితే బుధవారం ఫ్లెక్సీ నిర్వాహకుల అభ్యర్థన మేరకు కోర్టు ఫిబ్రవరి 22 వరకు సమయం ఇచ్చిందన్నారు. గడువు తర్వాత పట్టణంలో ఎలాంటి ప్లాస్టిక్ ఫ్లెక్సీ, బ్యానర్లు ఏర్పాటు చేయడానికి వీలులేదన్నారు. నిబంధనలు మీరితే చర్యలు తప్పవన్నారు.

కూలీలందరికీ ఉపాధి

రొళ్ల: గ్రామాల్లో జాబ్ కార్డులు ఉన్న ప్రతి కూలీకి ఉపాధి పనులు కల్పించి వలసలు నివారించడానికి ఎఫ్‌ఏలు చర్యలు తీసుకోవాలని ఏపీఓ నాగరాజు పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏపీఓ నాగరాజు మాట్లాడుతూ ప్రతి పంచాయతీలోనూ 200 మంది కూలీలకు తక్కువ కాకుండా ఉపాధి చూపి వలసలు నివారించాలన్నారు.

గణతంత్ర వేడుకల్లో పాల్గొననున్న ఎమ్మెల్యే

పెనుకొండ: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఉదయం జరిగే గణతంత్ర వేడుకల్లో ఎమ్మెల్యే శంకరనారాయణ పాల్గొంటారని వైఎసార్‌సీపీ టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌పారూక్‌ఖాన్ తెలిపారు. ఉదయం 8 గంటలకు కార్యక్రమం జరుగుతుందని, అధికారులు, కౌన్సిలర్లు, ఉద్యోగులు హాజరుకావాలన్నారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

అమరాపురం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ ఈరన్న పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం మండల పరిధిలోని హేమావతి పీహెచ్‌సీలో ఆరోగ్య పరిరక్షణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో హెల్త్ కమిటీ చైర్మన్, ఎంపీపీ ఈరన్న మాట్లాడుతూ వైద్యులతో పాటు సిబ్బంది రోగులకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ భార్గవ్ , ఎంపీహెచ్ఈఓ ఉమాపతి, సర్పంచులు తిప్పేస్వామి, గిరిజమ్మ, పిహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలను శుభ్రంగా ఉంచాలి

మడకశిరరూరల్: మండలంలోని గోవిందాపురం పంచాయతీలోని గ్రామాల్లో మురికి కాలువలను శుభ్రం చేస్తూ రోడ్లపై పడేసిన చెత్తను తొలగించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని కార్యదర్శి ఈరలింగప్ప కార్మికులకు సూచించారు. గ్రామాల్లో రోడ్లపై చెత్త కుప్పలు వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

మట్టి తరలిస్తే కఠిన చర్యలు

పరిగి: మండలంలో ఎక్కడైనా అక్రమంగా మట్టిని తవ్వినా, ట్రాక్టర్లు, టిప్పర్లతో తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు సౌజన్యలక్ష్మి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం మండల వ్యాప్తంగా ఉన్న జేసీబీ వాహనాల యజమానులు, ట్రాక్టర్ల యాజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ స్థలాలతో పాటు ప్రైవేటు స్థలాల్లో కూడా భారీ గుంతలు పడేలా మట్టిని తవ్వేస్తున్నారని తహసీల్దార్ తెలిపారు. ఇకపై ఎక్కడైనా మట్టిని తరలిస్తే మైనింగ్ యాక్టు ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.